క్లుప్తంగా

నవదుర్గలుగా అలరించిన విద్యార్థినులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ముందస్తు దసరా వేడుకలతో పాటు బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు నవదుర్గల వేషధారణలో మహిషాసురమర్దని రూపకాన్ని ప్రదర్శించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో మహిళకు అత్యంత గౌరవాన్ని, సముచితమైన స్థానాన్ని ఇవ్వడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని, దీనిని దసరా ఉత్సవాలు ప్రతిబింబిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు ప్రతీకగా నవదుర్గల వేషధారణతో పాటు తెలంగాణాలో జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలను జరుపుకోవడం మెచ్చుకోదగిన విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వైష్ణవి, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వేదవతి, ఏ.బాజీబాబు, ఎన్.మణికంఠ, పి.శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దూకుడును అడ్డుకోవాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అంతర్జాతీయ సమాజం ఒక్క తాటిపై నిలిచి దౌత్య పరమైన ఒత్తిడి తీసుకురావడం ద్వారానే ఇజ్రాయిల్ దూకుడుకు ముక్కుతాడు వేయగలమని విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మేధావుల చర్చ గోష్టి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాలస్తీనా జాతి నిర్మూలనే లక్ష్యంగా ఇజ్రాయిల్ నరమేధం సాగిస్తుందన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, రాజకీయ విశ్లేషకులు పి.వి.రావ్ తదితరులు ప్రసంగించారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతరు



నగరంలో ఓ భవన నిర్మాణానికి వాడుతున్న నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకరు నీళ్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి దందాకు ఇంజినీరింగ్ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఒక పక్క నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వాటర్ ట్యాంకులను భవన నిర్మాణాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రోజుకు లక్షలాది లీటర్ల మంచినీరు అక్రమంగా ట్యాంకుల ద్వారా తరలించి భవన నిర్మాణాలకు, కమర్షియల్ పనులకు వినియోగించుకుంటూ వేల రూపాయలను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకర్ల దోపిడీని అరికట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోయి ప్రమాదాలు అధికమవుతున్నాయని, భవిష్యత్తులో ట్రాఫిక్ కష్టాలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు నగర అదనపు కమిషనర్(ఇన్‌ఛార్జ్) డి.శ్రీనివాస్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల మీద ఆక్రమణలు పెరిగిపోవడం, ఆటోలు, సిటీ బస్సులు క్రమం లేకుండా ఎక్కడబడితే అక్కడ ఆపడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అంతేకాకుండా మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ యాక్సిడెంట్లు చేస్తున్నారని వాపోయారు. నగరంలో సీసీ కెమెరాల పటిష్టమైన నిఘా లేకపోవడం వలన ట్రాఫిక్ సమస్య, ఇతర సమస్యలు పెరిగిపోతున్నాయని...సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెంచాలని కోరారు. జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, నల్లపు నీలాంబరం ఇతర నాయకులు పాల్గొన్నారు.

సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకుడి అరెస్ట్

పట్నంబజారు: సింగిల్ నెంబర్ లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరువారి తోటలోని స్వర్ణాంధ్ర హోటల్ వద్ద సింగిల్ నెంబర్ లాటరీ ఆటో నిర్వహిస్తున్న బ్రహ్మారెడ్డి అనే వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.ఏడు వేల నగదు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

సర్వం డిజిటల్ మయం

- గుంటూరు నగరంలో పెరిగిన డిజిటల్ చెల్లింపులు
- క్రమంగా తగ్గుతున్న నగదు లావాదేవీలు
- చిరు వ్యాపారుల నుంచి బడా షాపింగ్ మాల్స్ వరకు అదే జోరు



కొరిటెపాడు(గుంటూరు): చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. డెబిట్, క్రెడిట్ కార్డులు, సెల్‌ఫోన్ అందుబాటులో ఉంటే చాలా కావాల్సినవి కొనుక్కోవచ్చు. పాల ప్యాకెట్లు తీసుకోవచ్చు.. హోటల్‌లో తినొచ్చు.. వేడివేడి టీ తాగొచ్చు.. మార్కెట్లో కూరగాయలు కొనొచ్చు.. చేతిలో సెల్ ఉండి అందులో ఫోన్ పే, గూగుల్ పే, యోనో వంటి యాప్‌లు ఉంటే చాలు ఏ సమయంలో అయినా.. ఎక్కడైనా సర్వైవ్ అయిపోవచ్చు. ప్రపంచం డిజిటల్ మయంగా మారడంతో వీధి వ్యాపారులు.. సందుల్లో బుట్టల్లో కూరగాయలు విక్రయించే వారు సైతం డిజిటల్ పేమెంట్లపై మక్కువ చూపిస్తున్నారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులకు తెర తీస్తున్నారు.

నగరంలో పెరిగిన డిజిటల్ చెల్లింపులు

గుంటూరు నగరంలో అన్ని ప్రాంతాలలోనూ చివరకు తోపుడు బండ్లు, గంపలపై పండ్లు అమ్ముకునే చిన్న చిన్న వ్యాపారులు కూడా ఫోన్ పే అంటున్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర థర్డ్ పార్టీ యాప్‌ల సాయంతో ప్రజలు ఆన్‌లైన్ లావాదేవీలను సులభంగా చేస్తున్నారు. తక్కువ పరిధిలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండటంతో వీటికి ఆదరణ లభిస్తోంది. కిరాణా, నిత్యావసరాలు, పెట్రోలు తదితర సామగ్రి మొదలుకొని మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, రుణాల చెల్లింపులు, నగదు బదిలీలు తదితర అవసరాలన్నింటికీ వీటినే ఉపయోగిస్తున్నారు.

బ్యాంకుల్లో డిజిటల్‌కే ప్రాధాన్యం..

బ్యాంకుల్లో సైతం డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా నేరుగా బ్యాంకు నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. అయితే ఈక్రమంలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆదమరిస్తే ఖాతా మొత్తం ఖాళీఅయ్యే పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. కొంతమంది నకిలీ వ్యక్తులు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు, పిన్ నంబర్లు అడిగితే పొరపాటున కూడా చెప్పొద్దని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అలా అడిగితే తక్షణమే ఫోన్ కట్ చేసి బ్యాంకులో సంప్రదించాలని సూచిస్తున్నారు.

చిల్లర సమస్యకు పరిష్కారం..

డిజిటల్ చెల్లింపుల ద్వారా చిల్లర సమస్యకు పరిష్కారం దొరికినట్లయింది. గతంలో పదో, పదిహేను రూపాయలో ఖర్చుచేసి చెల్లింపునకు రూ.వంద నోటు ఇస్తే చిల్లర ఇచ్చేందుకు దుకాణ నిర్వాహకులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు యూపీఐ ద్వారా పేమెంట్ చేస్తుండడంతో అటు వినియోగదారుడికి, ఇటు వ్యాపారికి ఎటువంటి ఇబ్బంది లేనట్లయింది.

బ్యాంకులకు వెళ్లే అవసరం తగ్గింది..



యూపీఐ లావాదేవీలు వినియోగం పెరిగిన తరువాత మా పని సులువైంది. కలెక్షన్ కూడా యూపీఐ ట్రాన్సాక్షన్ ద్వారా చెల్లిస్తున్నారు. కౌంటర్ సేల్స్ కూడా ప్రతి రోజు బ్యాంకుకు వెళ్లి చెల్లించాల్సిన పనిలేదు. ఖాతాదారులు నేరుగా మా ఖాతాల్లోకి నగదు ట్రాన్స్‌ఫర్ చేస్తుండడంతో మాకు లావాదేవీలు సులువయ్యాయి.

–శేకూరి రాజశేఖర్, ఆర్టీసీ బస్టాండ్ రైతుబజార్, విజయ డెయిరీ నిర్వాహకుడు

60 శాతం మంది డిజిటల్ ద్వారానే చెల్లిస్తున్నారు



కొబ్బరి బొండాల కోసం వచ్చిన వారు దాదాపు 60 శాతం మంది ఫోన్ పే చెల్లింపులే చేస్తున్నారు. ఫోన్ పే ద్వారా రూ.10 అయినా, రూ.100 అయినా ఎంత అమౌంట్ అయినా క్షణాల్లో చెల్లిస్తున్నారు.

–ఎ.రాజు, కొబ్బరి బొండాల వ్యాపారి, అమరావతి రోడ్, గుంటూరు

చెల్లింపులు మరింత ఈజీ..



గతంలో ఎక్కువ మొత్తంలో షాపింగ్ చేసేందుకు డబ్బులు వెంట తీసుకువెళ్లేవాళ్లం. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆ అవసరం లేకుండా పోయింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా, క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం తేలికయింది.

–వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కొరిటెపాడు, గుంటూరు

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు

- అలా లేకుంటే ఓసీ జారీచేయబోం
- నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు



భవన నిర్మాణ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రైనేజీ లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కోదండరామయ్య నగర్, గోరంట్ల, పెద్ద పలకలూరు రోడ్, కాకాని రోడ్, ఆర్టీసీ కాలని తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవనాలు నిర్మాణ దశలో వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్టీసి కాలనిలో డ్రైన్‌ని ఆక్రమించి ర్యాంప్‌లు చేసిన నిర్మాణం గమనించి సంబంధిత ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్ మీదవరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. వాచ్‌మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్టుమెంట్ నిర్వాహకులే డ్రైనేజీ లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ డి.రాంబాబు, టీపీఎస్‌లు లక్ష్మణస్వామి, సువర్ణ కుమార్, రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు.

జీజీహెచ్ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత



ఆసుపత్రిలో పరిసరాలు శుభ్రం చేస్తున్న డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద సుందరీకరణ కోసం ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆస్పత్రి లోపల గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుండటం వలన వైద్యులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇటీవల వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసుపత్రిలోనికి కేవలం రోగులు, వారి సహాయకులను మాత్రమే అనుమతించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేసేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి గోడలను నీళ్లతో కడిగి పరిశుభ్రం చేశారు. ఎలాంటి దుర్గంధపూరితమైన వాతవరణం లేకుండా సుందరీకరణ చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పారిశుద్ధ్య నిర్వహణ, సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఆస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డెకాథ్లాన్‌లో సత్తా చాటిన మునీర్



విద్యార్థి మునీర్‌ను అభినందిస్తున్న రామకృష్ణమూర్తి, నర్సిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా డెకాథ్లాన్ ఈవెంట్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి షేక్ మునీర్ తృతీయస్థానంలో నిలిచినట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం అమరావతిరోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన 37వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-20 బాలుర విభాగంలో తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. విద్యార్థి మునీర్‌కు భవిష్యత్తులో క్రీడల్లో ముందుకెళ్లేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరి రవి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏసీఈ యోబు మృతి



ఏసీఈ ఎస్.యోబు (ఫైల్)

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఏసీఈ (అడిషినల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) నంబూరు యోబు(61) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. అస్వస్థతకు గురికావడంతో సోమవారం యోబును కుటుంబ సభ్యులు తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో ఆయన ఆస్పత్రిలోనే మృతి చెందారు. డిప్యూటీ రిజిస్ట్రార్ కేడర్‌లో ఉన్న యోబు పదిహేను రోజుల క్రితం ఏసీఈగా చార్జ్ తీసుకున్నారు. యూనివర్సిటీలో ఉద్యోగిగా పలు హోదాల్లో విధులు నిర్వహించిన ఆయన యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బంది సంఘం 'వికాస'లో సుదీర్ఘ కాలం పదవులు నిర్వహించి ఉద్యోగులు, యూనివర్సిటీ వర్గాల మన్ననలు పొందారు. ఆయన మృతిపై వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు, పరిశోధకులు విచారం వ్యక్తం చేశారు. యూనివర్సిటీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

పీఎంజే జ్యువెల్స్ నూతన షోరూం ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నగరంపాలెం: గుంటూరులో పి.ఎం.జె. జ్యువెల్స్ షోరూమ్‌ను నెలకొల్పడం అభినందనీయమని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురు నూతనంగా ఏర్పాటు చేసిన పి.ఎం.జె.జ్యువెల్స్ షోరూంను సోమవారం జ్యోతిప్రజ్వలన చేసి ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ షోరూం ఆభరణాల ప్రియులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. పి.ఎం.జె జ్యువెల్స్ ఏపీ అధినేత హైదర్‌అలీ మాట్లాడుతూ గుంటూరు నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆభరణాల ప్రియులు ఈ షోరూంలోని సరికొత్త డిజైన్లను ఇష్టపడతారని అన్నారు. క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్‌కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్‌కృష్ణచైతన్య మాట్లాడుతూ ఆభరణాల వేదికపై ప్రసిద్ధి చెందిన జ్యువెల్స్ పిఎంజె అని అన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రదర్శించిన కొత్త డిజైన్‌లను కస్టమర్లు స్వయంగా పరిశీలించారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం రవాణా వాహన డ్రైవర్‌ను అదుపులో తీసుకున్న ఏఎస్ఐ సాంబశివరావు, సిబ్బంది

లక్ష్మీపురం: నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సాంబశివరావు పలకలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్ వాహనాన్ని అడ్డుకోని స్టేషన్‌కు తరలించిన ఘటన సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్ల, పలకలూరు రోడ్డు కరెంట్ ఆఫీస్ దగ్గరలో మెయిన్ రోడ్డుపై పెదపలకలూరు వైపున పీడీఎస్ బియ్యంను బొలెరో వాహనంలో అక్రమ రవాణా చేస్తున్నారు. అదే సమయంలో నైట్ బీట్ విధులు నిర్వహిస్తున్న స్టేషన్ ఏఎస్ఐ సాంబశివరావు అనుమానంతో వాహనం నిలిపి స్టేషన్‌కు సమాచారం తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జడా నాగేశ్వరరావు, ఫణి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనంలో తనిఖీలు చేయగా 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించింది. వాహనంలోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి సెల్ ఫోన్‌లు, రూ.6వేల నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరంలోని నల్లచెరువు విద్యుత్ కార్యాలయం పరిధిలో ఎమర్జెన్సీ మరమ్మతుల దృష్ట్యా సంపత్‌నగర్, కొబ్బరితోట, నల్లచెరువు 7, 8, 9 లైన్లు, పార్వతీపురం, అడపాబజార్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ శాఖ ఏఈ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనతో తెలిపారు.



సంపత్‌నగర్ శృంగేరి శంకరమఠంలో గరుడవాహన అలంకారం



బ్రాడీపేట 2/14లోని సుంకర మందిరంలో సంతానలక్ష్మిగా..



సిద్ధార్థ నగర్ కనక మహాలక్ష్మీ దేవాలయంలో కుసుమాంబగా..



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ దేవస్థానంలో..



కృష్ణనగర్‌లో మహాచండీ దేవీ అలంకారం

మహా కనకదుర్గా.. విజయ కనకదుర్గా!

నగరంలో దేవీశరన్నవరాత్రులు సోమవారానికి అయిదో రోజుకి చేరాయి. ఉదయం నుంచి విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు. ప్రత్యేక అలంకారాలతో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. – నగరంపాలెం, గుంటూరు ఎడ్యుకేషన్



చుట్టుగుంట పోలేరమ్మతల్లి దేవస్థానంలో మహాచండీదేవి అలంకారం



కొరిటెపాడు కోదండ రామాలయంలో సంతానలక్ష్మీదేవిగా..



బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భవానీదేవిగా..



వికాస్‌నగర్ శ్రీషిర్డీ సాయి మందిరంలో అన్నపూర్ణదేవిగా..



మల్లిఖార్జునపేట శివాలయంలో లలితా త్రిపుర సుందరీదేవి

బెదిరింపులకు దిగిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కుటుంబ ఖర్చుల కోసం అప్పు తీసుకుని నాలుగు సంవత్సరాలైనా చెల్లించక పోగా బెదిరింపులకు దిగిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 10వ లైన్ ప్రాంతానికి చెందిన కొత్త అనంతరామిరెడ్డి అనే వ్యక్తి వద్ద లింగాయపాలెం ప్లాట్‌లలో నివాసం ఉండే నారాయణరావు అనే వ్యక్తి రూ.లక్ష నగదు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకుని నాలుగు సంవత్సరాలు అవుతున్న చెల్లించక పోగా అడిగేందుకు వెళ్లిన అనంత రామిరెడ్డిపై దురుసుగా వ్యవహరించడం, బెదిరింపులకు దిగడం చేస్తున్నాడు. దీంతో బాధితుడు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నారాయణరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానంటూ మోసం చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఒకే ప్రాంతంలో ఉంటూ ప్రేమించి చివరకు వివాహం చేసుకోకుండా బెదిరింపులకు దిగుతూ దుర్భాషలాడిన వ్యక్తి పై నగరంపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావు పేట 2వ లైన్ ప్రాంతానికి చెందిన అమరబోయిన పూర్ణ అనే యువతి, అదే ప్రాంతానికి చెందిన తన్నీరు గౌతమ్‌లు ప్రేమించుకున్నారు. చాలా కాలంగా ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. అయితే వివాహం చేసుకోమని అడిగినందుకు గౌతమ్ పూర్ణను వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తన్నీరు గౌతమ్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.